

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY









PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 27-08-2026 సంపుటి : 08 సంచిక 70 పేజీలు : 8 వెల : రూ 3-00


## జనవరి 1 నుంచి సంజీవని సేవలు: సీఎం చంద్రబాబు



అమరావతి, ఆగస్టు 26: 2027, జనవరి 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. బుధవారం రాజధాని అమరావతిలో వైద్య ఆరోగ్య సేవలు, సంజీవని ప్రాజెక్ట్ సేవలపై ఆయన సమీక్షించారు. కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో అమలు చేసిన ప్రాజెక్ట్ ఫలితాలను ఆధారంగా చేసుకుని కార్యాచరణ రూపొందించాలని వారికి సీఎం సూచించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి వీర పాండ్యన్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

### జెన్ జీ యువతతో సమావేశాలు.. కోటంరెడ్డిపై నారా లోకేశ్ ప్రశంసలు


విజయవాడ, ఆగస్టు 26,నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి 'జెన్ జీ' యువతతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం పట్ల ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. తర్వాతి తరం ఆలోచనలను అర్థం చేసుకోవడానికి ఈ కార్యక్రమం ఒక అద్భుతమైన చొరవ అని ఆయన కొనియాడారు.ప్రస్తుత యువత ఆశలు, లక్ష్యాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, వారి నూతన ఆలోచనలను తెలుసుకోవడం నాయకులకు ఎంతో అవసరమని లోకేశ్ అన్నారు. యువత ఆకాంక్షలను సరిగ్గా అర్థం చేసుకుని, వారికి ఉపయోగపడే కార్యక్రమాలను రూపొందించడానికి ప్రజాప్రతినిధులు వారితో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు. యువతతో జరిగే ఇటువంటి ఆసక్తికరమైన, లోతైన భావాల మార్పిడి కార్యక్రమాల కోసం తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపారు.

## యువతతో ప్రధాని సంభాషణ.. 'ఖేలో ఇండియా డైలాగ్'లో పాల్గొననున్న మోదీ




ఢిల్లీ, ఆగస్టు 26: జాతీయ క్రీడా దినోత్సవం-2026 సందర్భంగా రేపు(బుధవారం) ఉదయం 11:00 గంటలకు 'ఖేలో ఇండియా డైలాగ్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా పాల్గొని యువతను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. క్రీడలు, యువ నాయకత్వం, ఫిట్‌నెస్, దేశ నిర్మాణంపై యువతతో చర్చించనున్నారు. 'యువ సంవాద్'లోని కీలక అంశాలపై మాట్లాడనున్నారు. క్రీడా మౌలిక వసతులు, కోచింగ్, స్పోర్ట్స్ సైన్స్‌పై ప్రత్యేక చర్చ నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలోని రెండు కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ఈ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నారు.యువ నాయకత్వం, స్వచ్ఛంద సేవలను ప్రోత్సహించడం వంటి వాటిపై మోదీ ప్రసంగం ఉండనుంది. భవిష్యత్తు నైపుణ్యాలు, పౌర బాధ్యతపై ప్రధాని మోదీ దిశానిర్దేశం చేయనున్నారు. యువత ఆకాంక్షలు జాతీయ క్రీడా విధానంలో భాగం కావాలని ప్రధాని పిలుపునివ్వనున్నారు. అలాగే 2026 ఒలింపిక్స్ లక్ష్యంగా ప్రతిభావంతుల గుర్తింపు, శిక్షణలపై ఆయన చర్చ నిర్వహించనున్నారు.ప్రధాని మోదీ 'నషా ముక్త్ యువ' ఉద్యమంపై యువతతో ప్రత్యేకంగా సంభాషించనున్నారు. క్రీడల ద్వారా మాదక ద్రవ్యాల వ్యసనాలను రూపుమాపడానికి ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా యువతతో ప్రముఖ భారత క్రీడాకారులు, పతక విజేతలు తమ అనుభవాలను పంచుకోనున్నారు. భవిష్యత్తు నిర్మాణానికి సూచనలు చేయనున్నారు.

## సముద్రంలో గల్లంతైన ఏడుగురు కోనసీమ మత్స్యకారులు క్షేమం



కోనసీమ, ఆగస్టు 26: సముద్రంలో గల్లంతైన కోనసీమకు చెందిన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ లభ్యమైంది. బెంగాల్-ఒడిశా బోర్డర్‌లో మత్స్యకారుల ఆచూకీని మరో బోటు సిబ్బంది గుర్తించారు. గల్లంతైన మత్స్యకారులంతా క్షేమంగా ఉన్నట్లు సమాచారం అందడంతో వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఆగస్టు 3న కోనసీమ జిల్లా ఓడలరేవు ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఎపిఇఎ-ఒఖ-ఇ8-ఓా-135 'ముత్యాలమ్మ' బోటులో ఏడుగురు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లారు. అనంతరం వారు గల్లంతయ్యారు. అప్పటి నుంచి వారి ఆచూకీ కోసం అధికారులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.తాజాగా పశ్చిమబెంగాల్‌లోని దిగా ప్రాంతం వద్ద మరో బోటు సిబ్బంది.. గల్లంతైన బోటును గుర్తించారు. అందులో ఉన్న ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారించారు. ఇంజిన్ చెడిపోవడం వల్లే మత్స్యకారులు ప్రయాణిస్తున్న బోటు కొంతకాలంగా కదలలేని పరిస్థితిలో సముద్రంలోనే ఉండిపోయినట్లు తెలుస్తోంది. ఏడుగురు మత్స్యకారులను గుర్తించిన మరో బోటు సిబ్బంది.. ఇంజిన్ పనిచేయని బోటును మరో బోటుకు కట్టి ఒడ్డుకు తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. దాదాపు 23 రోజుల తర్వాత మత్స్యకారులు క్షేమంగా ఉన్నారనే సమాచారం అందడంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.సముద్రంలో గల్లంతైన ఏడుగురు కోనసీమ మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేసిందన్నారు. జిల్లా కలెక్టర్, కమిషనర్, మత్స్యశాఖ జేడీ, ఎఫ్‌డీవోలకు మంత్రి అభినందనలు తెలియజేశారు. మత్స్యకారులను స్వస్థలానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని, పశ్చిమ బెంగాల్ వెళ్లాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## నేపాల్ ప్రధాని బాలెన్ షాతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ

భారత ప్రధాని నరేంద్ర మోదీ.. నేపాల్ ప్రధాని బాలెన్ షాతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. మెరుపు వరదల కారణంగా జనం ప్రాణాలు కోల్పోవటంపై ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. వరద పరిస్థితులపై ఆరా తీశారు. అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని మోదీ భరోసా ఇచ్చారు. ఈ మేరకు ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో బుధవారం ఓ పోస్టు పెట్టారు.ఆ పోస్టులో.. 'ప్రధాన మంత్రి బాలేంద్ర షాతో మాట్లాడాను. నేపాల్‌లో సంభవించిన వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలియజేశాను. ఈ కష్టసమయంలో నేపాల్‌లోని సోదర సోదరీమణులకు భారతదేశ ప్రజలు అండగా ఉంటారు. నేపాల్‌కు సాధ్యమైనంత వరకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడానికి భారతదేశం సిద్ధంగా ఉంది. సహాయక, రక్షణ చర్యలపై మా బృందాలు పరస్పరం సమన్వయంతో పనిచేస్తున్నాయి' అని పేర్కొన్నారు.ఉద్ధృతంగా ప్రవహించిన భోటేకోశీ నది నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. టిబెట్ వైపు నుంచి వచ్చిన మెరుపు వరదల కారణంగా పలు ఊళ్లు, బ్రిడ్జిలు, ప్రాజెక్ట్‌లు నీటిలో కొట్టుకుపోయాయి. వరద బీభత్సం కారణంగా బుధవారం ఉదయం రసువా జిల్లాలో 1000 మంది నీటిలో కొట్టుకుపోయారని అధికారులు అంచనా వేస్తున్నారు. వరదలో కొట్టుకుపోయిన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది.



## గొడ్డలి పార్టీలో పాపం చేసిన వారెవ్వరూ శిక్షల నుంచి తప్పించుకోలేరు: కొల్లు రవీంద్ర



అమరావతి, ఆగస్టు 26: గొడ్డలి పార్టీలో పాపం చేసిన వారెవ్వరూ శిక్షల నుంచి తప్పించుకోలేరని ఆంధ్రప్రదేశ్ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. బుధవారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. ఎల్ నినోపై అసెంబ్లీలో చర్చ పెడితే ఇంట్లో పడుకున్న వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. ఇప్పుడు ప్రెస్ మీట్ పెట్టి అభూతకల్పనలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జగన్ ఐదేళ్ల పాలన దుర్మార్గాలు.. అసెంబ్లీ వేదికగా బయటపడతాయనే సభకు రాకుండా ఇంటికి పరిమిత మవుతున్నారంటూ వైసీపీ అధినేతపై నిప్పులు చెరిగారు.తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ మెప్పు కోసం రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టిన దుర్మార్గుడు జగన్ రెడ్డి అని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. జగన్ దోపిడీ, ధన దాహానికి ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ విధ్వంసానికి గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టిసీమ పంపులు కాటాకు వేయాలని నాడు జగన్ మాట్లాడ లేదా? అని ప్రశ్నించారు. అదే పట్టిసీమ ప్రాజెక్టు ఎల్ నినో పరిస్థితుల్లో ఆదుకుంటోందని గుర్తు చేశారు.సీఎం చంద్రబాబు ముందు చూపు కారణంగా జలాశయాల్లో నీటిని నిల్వ చేయటం వల్ల క్లిష్ట పరిస్థితుల్ని సైతం ఎదుర్కోగలుగుతున్నామని చెప్పారు. జలవనరులపై జగన్ రెడ్డివి అవగాహన లేమి మాటలని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. రాయలసీమకు ద్రోహం చేసి ఇప్పుడు కపట ప్రేమ నటిస్తున్నారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ రెడ్డి తీరును ఎండగట్టారు. తన రాజకీయ స్వార్థం కోసం 102 టెండర్లను రాయలసీమలో జగన్ రెడ్డి రద్దు చేశాడని మంత్రి కొల్లు రవీంద్ర వివరించారు.జగన్ నిర్లక్ష్యం కారణంగానే పోలవరం నిర్మాణ ఖర్చు పెరిగిందని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని తట్టుకోలేకే జగన్ వరుస ప్రెస్ మీట్లు పెడుతున్నాడని తెలిపారు. బీసీలు బాగు పడటం నచ్చని జగన్‌కు వారి గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. సొంత కేసులకు కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించిన జగన్ బీసీ రిజర్వేషన్ల కోతను మాత్రం పట్టించుకోలేదన్నారు. మద్యం కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి కారుమూరి అడ్డంగా దొరికితే రాజకీయ ప్రయోజనాల కోసం బీసీ కార్డు వాడతారా? అంటూ వైసీపీ అధినేత జగన్ తీరు పట్ల మంత్రి కొల్లు రవీంద్ర అసహనం వ్యక్తం చేశారు.

## అమరావతి అసెంబ్లీకి సరికొత్త డిజైన్: మంత్రి మనోహర్

అమరావతి: ప్రపంచంలోనే అద్భుతమైన రాజధానిగా అమరావతిని నిర్మించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాజధాని నిర్మాణంలో భాగంగా అసెంబ్లీ భవనాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూపొందిస్తున్నామని చెప్పారు.అసెంబ్లీ భవనం పైభాగంలో టవర్ ఏర్పాటు చేసి.. అక్కడి నుంచి మొత్తం రాజధాని ప్రాంతాన్ని వీక్షించేలా నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్‌లో జరిగే నియోజకవర్గాల డీలిమిటేషన్‌ను దృష్టిలో ఉంచుకుని అసెంబ్లీ భవన డిజైన్లపై చర్చించినట్లు మంత్రి తెలిపారు. 265 అసెంబ్లీ స్థానాలు, 110 శాసనమండలి స్థానాలకు అనుగుణంగా భవన నిర్మాణ డిజైన్‌ను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.అసెంబ్లీని సందర్శించే ప్రజలకు మంచి అనుభూతి కలిగేలా ప్రత్యేకంగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.




# సంపాదకీయం

గురువారం 27-08-2026

## మోదీ మాస్టర్ స్ట్రోక్!

భారత రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేసే కీలకమైన 'జమిలి ఎన్నికల' విధానంపై మరోమారు చర్చ మొదలైంది. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే తమ సర్కారు అధికారంలో ఉన్న 22 రాష్ట్రాలు, యూటీల శాసన సభ ఎన్నికలను కలిపి నిర్వహించడానికి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నది. భారత ఎన్నికల వ్యవస్థలో పెద్ద మార్పు తీసుకురావాలనే ప్రయత్నం కొన్ని నెలలుగా కొనసాగుతోంది. లోక్‌సభ, విధానసభల ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలనే 'వన్ నేషన్?వన్ ఎలక్షన్' ప్రతిపాదనపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చర్చలు తీవ్రమవుతున్నాయి. కమిటీ ఛైర్మన్ పీపీ చౌదరి ఇటీవలి అప్‌డేట్‌లో స్టేక్‌హోల్డర్లలో అధిక శాతం మద్దతు ఉందని, 2034కు బదులు 2029లోనే అమలు చేయవచ్చని సూచించారు. ఇదే ఇప్పుడు చర్చనీయాంశం అయింది. జేపీసీ ఛైర్మన్ పీపీ చౌదరి ప్రకారం, ఇప్పటివరకు సంప్రదించిన సివిల్ సొసైటీ, నిపుణులు, వివిధ సంస్థల్లో సుమారు 99 శాతం మంది జమిలి ఎన్నికలకు అనుకూలంగా మాట్లాడారు. కమిటీ పలు రాష్ట్రాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరిస్తోంది. రాజ్యాంగ సవరణ 2028లోగా పూర్తయితే, 2029 లోక్‌సభ ఎన్నికలతోపాటు కొన్ని విధానసభలను కలిపి నిర్వహించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల సమ్మతి కీలకం. కొన్ని రాష్ట్రాలు తమ అసెంబ్లీలను ముందస్తుగా రద్దు చేసి చక్రం సరిపోల్చుకుంటే మరింత సులభమవుతుంది. దేశంలోని 17 రాష్ట్రాల్లో బీజేపీ సొంతంగా అధికారంలో ఉన్నది. మరో ఐదు రాష్ట్రాల్లో బీజేపీ మిత్ర పక్షాలు అధికారంలో ఉన్నాయి. అలా మొత్తంగా 22 రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రభుత్వాలే ఉన్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలు జరుగడానికి ముందే ఎన్డీయే పాలిత 11 రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరుగనున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే మరో నాలుగు ఎన్డీయే రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. మిగతా ఏడు ఎన్డీయేపాలిత రాష్ట్రాల ఎన్నికలు 2030–31 మధ్య జరుగనున్నాయి. దీంతో జమిలి ఎన్నికల కోసం తమ రాష్ట్రాల్లోని ప్రభుత్వాల పాలనను వెనక్కి కానీ ముందుకు కానీ జరుపుకునేందుకు పెద్దగా అభ్యంతరాలు ఉండకపోవచ్చని ఎన్డీయే సర్కారు భావిస్తున్నది. 2029లో ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం, హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో 'జమిలి' ప్రక్రియకు పెద్దగా ఇబ్బందులు ఎదురు కావడం లేదు. అయితే 2028లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, త్రిపుర, తెలంగాణ, మేఘాలయ, నాగాలాండ్, మిజోరం అసెంబ్లీల గడువు ముగుస్తున్నది. జమిలి ఎన్నికల కోసం ఆయా అసెంబ్లీల కాలాన్ని 5 నెలల నుంచి ఏడాది వరకు పొడిగించాల్సి ఉంటుంది. ఇక బీహార్, ఢిల్లీ, తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీల గడువు 2030–31లో ముగియనున్నది. వాటి గడువును ఒకటి నుంచి రెండేండ్లు తగ్గించాల్సి వస్తుంది. అయితే, ఇంతటి భారీ సంస్కరణకు పార్లమెంట్ శాసనపరమైన మార్పులు చేయడంతో పాటు విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం అవసరమవుతుంది. ఈ ప్రతిపాదనను జార్ఖండ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న విపక్ష ప్రభుత్వాలు పెద్దయెత్తున వ్యతిరేకించే అవకాశం ఉన్నది. ఈ క్రమంలోనే తొలుత తాము అధికారంలో ఉన్న 22 రాష్ట్రాల్లో జమిలి ప్రక్రియను కొనసాగించడానికి ఎన్డీయే ప్రభుత్వం కార్యచరణ సిద్ధం చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయిగతంలో 2034ని లక్ష్యంగా చెప్పినా, ఇప్పుడు ముందుకు తీసుకురావాలనే ఆలోచన బలపడుతోంది. ఇది రెండు దశల్లో అమలు కావచ్చు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు పి. చిదంబరం, ప్రియాంకా గాంధీ వాద్రా, సాగరికా ఘోష్, సుప్రియా సూలే తదితరులు పాల్గొన్నారు. చిదంబరం బలంగా వ్యతిరేకించారు. ప్రస్తుత రూపంలోని ప్రతిపాదన రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని దెబ్బతీస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని వాదించారు. ఎన్నికైన అసెంబ్లీల పదవీకాలాన్ని తగ్గించడం సమస్యాత్మకమని అభిప్రాయపడ్డారు. మరోవైపు పద్మ అవార్డు గ్రహీతలు, కొన్ని పాలసీ గ్రూపులు జాతీయ ప్రయోజనంగా చూశారు. అయితే తగిన రక్షణలు, స్పష్టమైన నిబంధనలు అవసరమని సూచించారు. ఎన్నికల కమిషన్‌కు అధిక అధికారాలు రాకుండా జాగ్రత్తలు కావాలని కూడా అభిప్రాయాలు వచ్చాయి. మద్దతుదారులు పదేపదే ఎన్నికల వల్ల జరిగే ఆర్థిక నష్టం, అభివృద్ధి పనుల్లో అంతరాయం, మోడల్ కోడ్ వల్ల పాలనా స్తబ్దతను ఎత్తి చూపుతున్నారు. జమిలి ఎన్నికలు ఖర్చు తగ్గించి, పాలనకు స్థిరత్వం ఇస్తాయని వాదిస్తున్నారు. ఇక వ్యతిరేకులు ఫెడరల్ వ్యవస్థ బలహీనపడే ప్రమాదం, ప్రాంతీయ సమస్యలు జాతీయ అంశాల్లో కలిసిపోయే అవకాశం, చిన్న పార్టీలపై ప్రభావం లాంటి వాటిని లెక్కపెడుతున్నారు. జేపీసీ నివేదిక శీతాకాల సమావేశం వరకు వాయిదా పడింది. రాజకీయ సమ్మతి ఏర్పడితే 2029లో పాక్షికంగా అయినా అమలు సాధ్యమే. లేకపోతే 2034 వైపు వెళ్తుంది. ఈ ప్రతిపాదన భారత ప్రజాస్వామ్య పనితీరును పునర్నిర్మించే ప్రయత్నం. సమ్మతి, రాజ్యాంగ రక్షణలు, రాష్ట్రాల సహకారం లేకుండా ముందుకు సాగడం కష్టం. భవిష్యత్ దిశను నిర్ణయించేది పార్లమెంట్ చర్చలు, రాజకీయ సంకల్పమే. కుల గణన విధానంపై విశ్లేషకులు, కార్యకర్తలు, రాజకీయ నేతలతో 'స్కోల్' సంస్థ మాట్లాడినప్పుడు పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. వారిలో అధికశాతం మంది కులాలను లెక్కించేందుకు ఎన్నుకున్న పద్ధతి లోపభూయిష్టమని అన్నారు.

## ప్రతిపక్షాలను వేధించేందుకే ఎథిక్స్ కమిటీ: వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్: మా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తనపై చర్చించి నిర్ణయం తీసుకునే ఎజెండా 29 నాటి మీటింగ్‌లో ఉంది. అసలు ఎథిక్స్ గురించి మాట్లాడే అర్హత సీఎం, మంత్రులకు ఉందా?ని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ సమావేశాల్లో పాడి కౌశిక్ రెడ్డి వ్యవహారాన్ని ఎథిక్స్ కమిటీకి నివేదిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని అన్నారు. రేవంత్ ఆ ప్రకటన చేసే టైమ్‌కు ఎథిక్స్ కమిటీ అనేదే లేదు. ఎథిక్స్ కమిటీ అనేది ప్రతిపక్ష సభ్యులపై చర్యలు తీసుకునేందుకు ఏర్పాటు చేశారా అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.ఆ రోజు పాడి కౌశిక్ రెడ్డి పక్కనే అసెంబ్లీలో ఉన్నాను. కడియం శ్రీహరిని ఉద్దేశించి మీది ఏ పార్టీ అని మాత్రమే కౌశిక్ రెడ్డి అన్నారు. కావాలనే కౌశిక్ రెడ్డి వ్యవహారాన్ని ఎథిక్స్ కమిటీకి నివేదించిన తీరును ఖండిస్తున్నాం అని అన్నారు. దానం నాగేందర్ శాసన సభలో సహచర సభ్యుడి తోలు తీస్తా,



హైదరాబాద్‌లో ఎట్లా తిరుగుతారో చూస్తా అన్నాడు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ కత్తుల కోలాటం చేస్తామని అన్నారు. అదేవిధంగా పొన్నం ప్రభాకర్, షాద్ నగర్ శంకరయ్య సభ్య సమాజం హర్షించతగని రీతిలో అసెంబ్లీ లో హావభావాలు ప్రదర్శించారు. వేముల వీరేశం కూడా అసెంబ్లీలో అనుచితంగా ప్రవర్తించారు. సీఎం రేవంత్ రెడ్డి బట్టలు ఊడదీసి కొడతా, బడివే, చెట్టుకు కట్టేసి కొడతా, జూబిలీ బస్‌స్టేషన్ లో బిచ్చమెత్తుకోవాలి అని సభ్యులనుద్దేశించి ఎన్నోసార్లు అసభ్యంగా మాట్లాడారు. సీఎం, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మాటలు ఎథిక్స్ కమిటీకి కనిపించలేదా అని మండిపడ్డారు.ముందుగా సీఎం రేవంత్ రెడ్డినే ఎథిక్స్ కమిటీ పిలిచి వివరణ కోరాలి. తర్వాతే కౌశిక్ రెడ్డిని విచారించాలి అని కోరారు. పాలక పక్షానికి ఓ న్యాయం ప్రతిపక్షానికి ఓ న్యాయమా.. ఎథిక్స్ కమిటీ పొలిటికల్ కమిటీగా మారకూడదు. మేం లేవనెత్తిన అంశాలన్నిటినీ ఎథిక్స్ కమిటీ కచ్చితంగా పరిశీలించాలి. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు ఉండవు కానీ ప్రతిపక్ష సభ్యులపై ఎథిక్స్ కమిటీతో చర్యలు తీసుకుంటారా అని దుయ్యబట్టారు. హై కోర్టు, సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసినా సీఎం తీరు మారడం లేదు.ఢిల్లీలో రాహుల్ గాంధీ రాజ్యాంగ రక్షణ అని తిరుగుతుంటే రేవంత్ రెడ్డి గల్లీలో రాజ్యాంగ భక్షణ చేస్తున్నారు విమర్శించారు. కాంగ్రెస్‌లో ఈ ద్వంద్వ ప్రమాణాలు ఎందుకు. ఎథిక్స్ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ కు ఉందా. అవినీతిపై రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలపై విచారణ కమిషన్ వేసే ధైర్యం రేవంత్ రెడ్డికి ఉందా. కొండా సుస్మిత రేవంత్ సోదరుడి షెల్ కంపెనీ గురించి మాట్లాడారు. దాని మీద ఏసీబీ విచారణ చేసే దమ్ము రేవంత్ రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. చిన్నారెడ్డి మేఘారెడ్డి టిక్కెట్ కోసం లంచం ఇచ్చారని ఆరోపణలు చేశారు. అపుడు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డే ఉన్నారు. రేవంత్ రెడ్డి తన నిజాయితీని నిరూపించుకునేందుకు విచారణ కు సిద్ధం కావాలి. పీసీసీ అధ్యక్ష పదవి కోసం రేవంత్ రెడ్డి హై కమాండ్‌కు కోట్లు ముట్టజెప్పారని కోమటి రెడ్డి ఆరోపణలు చేశారు. దమ్ముంటే వీటిపై విచారణ కమిషన్ వేసుకో రేవంత్ రెడ్డి అని ప్రశాంత్ రెడ్డి హెచ్చరించారు. బిల్లుల చెల్లింపునకు కమీషన్లు తీసుకుంటున్న అనిరుధ్ రెడ్డిపై విచారణ చేయించాలి. ఫార్మా సిటీని రద్దు చేసి ఫ్యూచర్ సిటీ పేరుతో దందాలు చేస్తున్న సీఎం సోదరులపై విచారణ జరపాలి. 22 ఏ పేరు మీద బ్రోకర్ల అవతారమెత్తి ప్రజలను లంచాలతో పీడిస్తున్న వారిపై విచారణ చేపట్టాలి. హైడ్రా పేరు మీద పేదల ఇండ్లపై ప్రతాపం చూపుతున్న దానిపై విచారణ చేయాలి అని పేర్కొన్నారు.ఆరు గ్యారంటీలు అమలు చేయని, దేవుళ్లపై ఒట్టు వేసి రైతు రుణమాఫీని పూర్తి చేయని, ఫీజు రీయిబర్స్‌మెంట్‌పై మాట తప్పిన సీఎం నైతికత గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. డైవర్షన్ రాజకీయాల్లో భాగంగా సీఎం ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 29న ఎథిక్స్ కమిటీ మీటింగ్‌కు హాజరవుతాం. సీఎం, మంత్రులను ముందు విచారణకు పిలవాలని డిమాండ్ చేస్తాం. ఇప్పటికైనా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకుంటే మంచిదని హితవు పలికారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, పాడి కౌశిక్ రెడ్డి, డాక్టర్ కే సంజయ్, అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పాల్గొన్నారు.

## కర్ణాటకలోని భూతనాథ సరస్సులో 6 మృతదేహాల లభ్యం

ఆగస్టు26 : కర్ణాటకలోని భూతనాథ సరస్సులో ఈ రోజు ఉదయం ఆరు మృతదేహాలు లభ్యమవడం కలకలం రేపింది. ఇంకా ఏవైనా మృతదేహాలు ఉన్నాయా అని పోలీసులు గాలిస్తున్నారు. ప్రముఖ చారిత్రక పట్టణమైన బాదామిలో గుహాలయాలకు కింది భాగంలో భూతనాథ సరస్సులో స్థానికులు ఆరు మృతదేహాలను గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సరస్సులో ఇంకా ఏవైనా మృతదేహాలు ఉన్నాయేమోనని గాలింపు చర్యలు చేపట్టారుమృతదేహాలు లభ్యమైన సరస్సు ప్రముఖ పర్యటక ప్రాంతం



అయినందున దీనిని వీక్షించేందుకు వచ్చి ప్రమాదవశాత్తు సరస్సులో పడి చనిపోయారా?, ఏమైనా ఆత్మహత్యా కోణమా?, ఎగువ నుంచి ఏమైనా కొట్టుకొచ్చాయా?, వీరితోపాటు ఇంకెవరైనా ఉన్నారా?, వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారా? అనే దిశగా పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## వందేమాతరం రెండు చరణాలనే పాడతాము: కర్ణాటక సీఎం

తమ రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇకపై వందేమాతర గేయానికి సంబంధించి రెండు చరణాలనే ఆలపిస్తామని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఈ విషయంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని అన్నారు. ఇటీవల రాష్ట్రంలో స్వాతంత్ర్య వేడుకల్లో ఆరు చరణాల జాతీయ గేయం పాడటంపై కూడా సీఎం డీకే శివకుమార్ స్పందించారు. తనకు తెలియకుండానే ఇది జరిగిపోయిందని అన్నారు. ఇకపై మాత్రం రెండు చరణాల జాతీయ గేయం ఉంటుందని స్పష్టం చేశారు.వందేమాతరం గేయానికి సంబంధించి రెండు చరణాలే పడాలన్న 1937 నాటి తీర్మానికి కట్టుబడి ఉండాలని గత వారం జరిగిన వర్కింగ్ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ నిర్ణయించింది. జాతీయ గేయానికి సంబంధించి ఆరు చరణాలు పాడాలనే నిబంధనకు కేంద్రం చట్టరూపం ఇచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుంది.'ఈ దేశంలో భిన్న రకాలు వర్గాలు ఉన్నాయి. కాబట్టి అందరితో కలిసి ముందుకు నడవాలని మేము విశ్వసిస్తాము. మా సిద్ధాంతం అదే' అని ముఖ్యమంత్రి అన్నారు. అందరినీ గౌరవించాలని చెప్పారు.



సూర్యచంద్రులు, గాలి, నీటికి ఏ మతమూ లేదని వ్యాఖ్యినంచారు. హిందూ వర్సెస్ హిందుత్వవాదంపై జరుగుతున్న చర్చ విషయంలో సీఎం శివకుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## బ్రో.. కాస్త ఆగు: రాహుల్‌కు కంగనా రనౌత్ కౌంటర్

నటి కృతి సనన్ వివాదంలో 'పితృస్వామ్యాన్ని కూల్చేయండి' అన్న రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు కంగనా రనౌత్ కౌంటర్ ఇచ్చారు. బీజేపీ అధికారిక ఖాతాలో పోస్ట్ అయిన కొన్ని చిత్రాలను ఆమె రీషేర్ చేశారు. మహిళా రిజర్వేషన్, ట్రిపుల్ తలాక్ విషయాల్లో కాంగ్రెస్ వైఖరిని తప్పుపడుతూ ఈ చిత్రాలను బీజేపీ పోస్ట్ చేసిందిఓ చిత్రంలో రాహుల్ గాంధీ 'పితృస్వామ్యాన్ని కూల్చేయండి' అని చెబుతారు. దానికి ఓ మహిళ 'మరి ట్రిపుల్ తలాక్ సంగతేంటి?' అని ప్రశ్నిస్తుంది. దానికి రాహుల్ 'అది ఓట్ బ్యాంకు కోసంలే.. కానీ పితృస్వామ్యాన్ని కూల్చేయండి' అని బదులిస్తారు. ఇంకో చిత్రంలో రాహుల్ మళ్లీ 'పితృస్వామ్యాన్ని కూల్చేయండి' అని చెబుతారు.అప్పుడు చిత్రంలోని మహిళ 'మీ పార్టీ మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఓటు వేసింది కదా' అని ఎద్దేవా చేస్తారు. దానికి రాహుల్ 'అది కూడా ఓట్ గేమే.. అయినా ఆ పితృస్వామ్యాన్ని కూల్చేయండి' అంటూ సమాధానమిస్తారు.

## నేపాల్‌లో ఆకస్మిక వరద బీభత్సం.. కొట్టుకుపోయిన ఊరు..



నేపాల్‌లో ఆకస్మిక వరద బీభత్సం సృష్టించింది. వరద కారణంగా ఒక ఊరు కొట్టుకుపోయింది. ఈ ఘటన నేపాల్–టిబెట్ సరిహద్దులోని రసువా జిల్లాలోని ఒక గ్రామంలో బుధవారం ఉదయం 9.00 గంటలకు జరిగింది. ఆకస్మికంగా సంభవించి వరద కారణంగా ఊరు కొట్టుకుపోగా.. ఊరిలోని 1,000 మంది వరకు ఇందులో కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. వీరి పరిస్థితి గురించిన సమాచారం ఇంకా వెల్లడికాలేదు. ఆ వరదల్లో 105 మంది భారతీయులు అదృశ్యమైనట్లు కూడా తెలుస్తోంది. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు ప్రారంభించాయి. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అలాగే, చుట్టుపక్కల ప్రాంతంలోని ప్రజలు సురక్షిత, ఎగువ ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిందిగా అధికారులు సూచించారు. ఈ ఘటన జరిగింది నేపాల్‌లోని రసువా జిల్లాలోని స్యాప్రు బేసి, టిమురే ప్రాంతాల్లో. ఇది పర్వత ప్రాంతం. పైగా ఇక్కడ భోటె కోషి అనే నది ఉంది. ఈ నది టిబెట్ నుంచి నేపాల్‌వైపు ప్రవహిస్తుంది. ఈ నదిలో నీరు ఉప్పొంగడంతోపాటు, దిగువ లోయ ప్రాంతం కావడం వల్ల ఇక్కడ భారీ వరద సంభవించింది.

## ఫైరింజిన్ నీటితో బీజేపీ ఎమ్మెల్యే కారుకు వాషింగ్..



సింగ్రౌలీ: మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలీకి చెందిన బీజేపీ ఎమ్మెల్యే రామ్ నివాస్ షా కారు(ను.. ఫైరింజిన్ నీటితో శుభ్రం చేశారు. ఈ ఘటనకు చెందిన వీడియో వైరల్ అవుతోంది. అగ్నిప్రమాద సమయంలో ఎమర్జెన్సీ కోసం వినియోగించే ఫైరింజిన్ నీటితో? కారును క్లీన్ చేయడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ రెసిడెన్స్ ఆవరణలో టొయోటా ఇన్నోవా కారును క్లీన్ చేశారు. అయితే తనకు తెలియకుండానే కారును శుభ్రం చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కానీ విపక్షాలు మాత్రం ఆ ఫుటేజీ పట్ల ప్రశ్నలు లేవనెత్తారు. పర్సనల్ వాహనం కోసం ప్రభుత్వ వనరులను వాడుకుంటున్నట్లు ఆరోపించారు. ఫైరింజిన్‌లో ఉండే నీటి పంపుతో.. మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులు కారును కడుగుతున్న వీడియో మంగళవారం వైరల్ అయ్యింది. ఈ ఘటన పట్ల తనకు సమాచారం లేదని సింగ్రౌలీ మున్సిపల్ కమిషనర్ సవితా ప్రధాన్ తెలిపారు. అవసరమైన సమయంలో అగ్నిప్రమాదం జరిగిన చోటుకు ఫైరింజిన్లు చేరుకోలేవని, కానీ సింగ్రౌలీలో మాత్రం అగ్నిమాపక సిబ్బందిని ప్రైవేటు కారు వాషింగ్ సెంటర్‌గా మార్చుకున్నట్లు విపక్ష నేత ఉమాంగ్ సింఘార్ ఆరోపించారు.

## నిరసనల్లో ఆస్తులను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు..

కోల్‌కతా, ఆగస్టు 26: నిరసనలు, అల్లర్ల సమయంలో ప్రభుత్వ లేదా పబ్లిక్ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు పశ్చిమ బెంగాల్ సర్కార్ సిద్ధమైంది. 'పశ్చిమ బెంగాల్ ప్రజా శాంతిభద్రతల నిర్వహణ (సవరణ) చట్టం, 2026'ను అమల్లోకి తెచ్చింది. ఇకపై ప్రభుత్వ లేదా పబ్లిక్ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి హెచ్చరించారు.సమాజంలో శాంతిభద్రతలను కాపాడటానికి, ప్రభుత్వ ఆస్తులను రక్షించడానికే ఈ 'యాంటీ–గూండా చట్టం'లోని భాగాన్ని అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 'పశ్చిమ బెంగాల్ ప్రజా శాంతిభద్రతల నిర్వహణ (సవరణ) చట్టం, 2026' ప్రకారం.. నిరసనల్లో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే, జరిగిన నష్టానికి మూడు రెట్లు పరిహారంతో పాటు వడ్డీని కూడా వసూలు చేస్తారు. ఒకవేళ నిందితులు నష్టపరిహారాన్ని చెల్లించకపోతే.. వారి ఆస్తులను జప్తు చేసి (అటాచ్‌మెంట్) వేలం వేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.నష్టాన్ని అంచనా వేయడానికి.. అల్లరిమూకలు, నిరసనకారులు, వారిని ఉసిగొల్పిన వారి (ఇన్‌స్టిగేటర్స్) నుంచి డబ్బును రికవరీ చేయడానికి ఒక ప్రత్యేక 'స్టాట్యుటరీ క్లెయిమ్స్ కమిషన్' పనిచేస్తుంది. డ్యూటీలో ఉన్న పోలీసు సిబ్బందిపై దాడులకు పాల్పడితే చట్టపరంగా తీవ్రమైన చర్యలు ఉంటాయి. ఈ కొత్త నిబంధనలను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి నబన్నాలో జరిగిన మీడియా ప్రతినిధుల సమావేశంలో అధికారికంగా ప్రకటించారు



# కేరళలో ట్రీట్ మెంట్ కు పవన్...

## పొలిటికల్ స్టైల్ కు మారలేకపోతున్న జనసేనాని



విజయవాడ, ఆగస్టు 26, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ కేబినెట్ సమావేశాలకు వరుసగా గైర్హాజరవుతుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి తర్వాత కేబినెట్‌లో కీలక స్థానం కలిగిన డిప్యూటీ సీఎం తరచూ సమావేశాలకు దూరంగా ఉండటం.. ప్రభుత్వ పరిపాలనపై, జనసేన పాత్రపై ప్రతిపక్షాలకు విమర్శలు చేసే అవకాశం కల్పిస్తోంది.పవన్ కల్యాణ్ గైర్హాజరీకి ప్రధాన కారణం ఆయన ఆరోగ్య పరిస్థితేనన్న చర్చ సాగుతోంది. గతంలో ఎదురైన గాయాలు, వెన్ను సంబంధిత సమస్యలు, అనారోగ్య సమస్యల కారణంగా ఆయనకు అప్పుడప్పుడు విశ్రాంతి అవసరమవుతోందని తెలుస్తోంది.రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత నిరంతర పర్యటనలు, ప్రజా కార్యక్రమాలు, అధికారిక సమీక్షలు, పార్టీ వ్యవహారాలతో పాటు దీక్షలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా ఆయనపై శారీరక ఒత్తిడిని పెంచుతున్నాయి.ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తికి ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ.. పాలనకు నిరంతర అందుబాటు కూడా కీలకమే. ముఖ్యంగా కేబినెట్ సమావేశాల్లో విధానపరమైన నిర్ణయాలు, శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చలు జరుగుతాయి కాబట్టి గైర్హాజరు రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంటోంది.పవన్ కల్యాణ్ రాజకీయ బాధ్యతలతో పాటు గతంలో ఒప్పుకున్న సినిమాల షూటింగ్‌లను పూర్తి చేస్తున్నారు. దీంతో ఆయన షెడ్యూల్‌పై అదనపు ఒత్తిడి ఏర్పడుతోందన్న అభిప్రాయం ఉంది.ఒకవైపు సినిమా షూటింగ్‌లు, మరోవైపు మంత్రిగా పర్యటనలు, సమీక్షలు, పార్టీ కార్యక్రమాలు కొనసాగితే విశ్రాంతికి సమయం తగ్గిపోవడం సహజం. గతంలో సినిమా రంగంలో ఉన్న ఫ్లెక్సిబుల్ షెడ్యూల్‌కు భిన్నంగా.. ప్రభుత్వ వ్యవహారాల్లో నిర్ణీత సమయాల్లో అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంటుంది.ఇక్కడే పవన్‌కు అసలు సవాలు ఎదురవుతోంది. సినిమా, రాజకీయాలు రెండింటినీ సమన్వయం చేయడం కంటే.. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పరిపాలనకు ప్రాధాన్యత ఇవ్వడం ఇప్పుడు మరింత అవసరం.పవన్ కల్యాణ్‌కు అప్పగించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలతో నేరుగా సంబంధం ఉన్న కీలక శాఖలు. ఈ శాఖల్లో విధాన నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ నిరంతరం కొనసాగాల్సి ఉంటుంది.కేబినెట్ సమావేశాలకు వరుసగా దూరంగా ఉండటం వల్ల నిర్ణయ ప్రక్రియలో జనసేనకు సంబంధించిన రాజకీయ ప్రాధాన్యం తగ్గే అవకాశం ఉందనే చర్చ కూడా జరుగుతోంది. అయితే దీనిని పవన్ శాఖల పనితీరుతో నేరుగా ముడిపెట్టే ముందు.. ఆయన గైర్హాజరీకి ఉన్న వాస్తవ కారణాలు, శాఖల పనితీరు వంటి అంశాలను విడిగా చూడాల్సి ఉంటుంది.ఆరోగ్య సమస్యలు నిజంగా ఉంటే వాటి నుంచి పూర్తిగా కోలుకోవడం మొదటి ప్రాధాన్యత. అదే సమయంలో సినిమా కమిట్‌మెంట్లను ఒక దశలో ముగించి, రాజకీయ బాధ్యతలకు స్పష్టమైన సమయాన్ని కేటాయించడం అవసరం.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంటి నిరంతరం పనిచేసే నాయకుడితో కలిసి ప్రభుత్వాన్ని నడిపిస్తున్న నేపథ్యంలో పవన్ తన పాత్రను మరింత స్పష్టంగా, నిరంతరంగా చూపించాల్సిన అవసరం ఉంది.కేబినెట్ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరు కావడం, శాఖలపై ప్రత్యక్ష పర్యవేక్షణ పెంచడం, ప్రభుత్వ నిర్ణయాల్లో చురుకైన భాగస్వామ్యం చూపించడం ద్వారా ప్రస్తుతం వినిపిస్తున్న విమర్శలకు సమాధానం చెప్పవచ్చు.పవన్ కల్యాణ్‌కు ఇప్పుడు అసలు పరీక్ష రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడం కాదు.. ఆరోగ్యం, సినిమా, ప్రభుత్వం అనే మూడు బాధ్యతల మధ్య సరైన సమతుల్యత సాధించడమే.

# ఉద్యోగ సంఘాల మధ్య ఆధిపత్య పోరు

గుంటూరు ఆగస్టు 26, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాడాల్సిన సంఘాల్లో అంతర్గత ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది. ఉద్యోగ వర్గాల్లో బలమైన పట్టు కోసం ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్ మధ్య తీవ్రమైన పోటీ వాతావరణం నెలకొంది. పెండింగ్ డీఏలు , పే రివిజన్ కమిషన్ నియామకం, పాత పెన్షన్ స్కీమ్ , పెండింగ్ బిల్లుల విడుదలకు సంబంధించి ప్రభుత్వంపై పోటాపోటీగా ప్రకటనలు గుప్పిస్తూ ఇరు నేతలు మీడియా వేదికగా బలప్రదర్శనకు దిగుతున్నారు. ఉద్యోగుల పక్షాన తామే అసలైన గొంతుకగా నిలుస్తున్నామనే ముద్ర వేయించుకునేందుకు సాగుతున్న ఈ ప్రయత్నం సంఘాల మధ్య ఐక్యతను దెబ్బతీస్తోంది.క్షేత్రస్థాయిలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కంటే సంఘాల రాజకీయ మైలేజీకే నేతలు ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ముందు విడివిడిగా వినతిపత్రాలు సమర్పించడం, విడివిడిగానే ఆందోళన కార్యక్రమాలకు పిలుపునివ్వడం ద్వారా ఉద్యోగులను రెండు వర్గాలుగా విభజిస్తున్నారనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్ నియామకం, డీఏ బకాయిలపై ఎవరు ముందుగా ప్రభుత్వాన్ని ఒప్పించారనే క్రెడిట్ కొట్టేయడమే లక్ష్యంగా ఇరు వర్గాలు పావులు కదుపుతున్నాయి. ప్రభుత్వ పెద్దలతో ఎవరు సన్నిహితంగా ఉంటూ ఉద్యోగుల పనులు చేయిస్తారనే పోటీ కూడా వీరి ఆధిపత్య సమరానికి మరింత ఆజ్యం పోస్తోంది.ఈ నాయకుల వ్యక్తిగత ప్రతిష్ట, అంతర్గత రాజకీయాల కారణంగా అసలు ఉద్యోగుల ప్రయోజనాలు గాల్లో దీపంలా మారుతున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఆయా సమయాల్లో ప్రభుత్వానికి అనుకూలంగానో లేదా ఉద్యమాలను నీరుగార్చేలానో వ్యవహరించారనే ఆరోపణలు ఇప్పటికే ఇరు నేతలపై ఉన్నాయి. గతంలో ఉమ్మడి పోరాటాలతో ప్రభుత్వాలను కదిలించిన చరిత్ర కలిగిన ఉద్యోగ సంఘాలు, నేడు కేవలం నాయకుల ఉనికి, భవిష్యత్ రాజకీయ ఆకాంక్షల కోసం వేర్వేరు కుంపట్లు పెట్టుకోవడం సాధారణ ఉద్యోగుల్లో తీవ్ర నిరాశను నింపుతోంది.ఒకే డిమాండ్ కోసం విడివిడిగా ఉద్యమాలు చేయడం వల్ల ప్రభుత్వానికి సాకులు చెప్పుకునే అవకాశం దక్కుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. నాయకులు తమ వ్యక్తిగత రాజకీయాలను, ఆధిపత్య పోరును పక్కన పెట్టి ఐక్య కార్యాచరణతో ముందుకు రాకపోతే ఉద్యోగుల హక్కులు సాధించుకోవడం మరింత క్లిష్టంగా మారుతుందని ఉద్యోగ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం వైసీపీ హయాంలో ఉద్యోగ సంఘాలు చేసిన విన్యాసాలను చూసిన తర్వాత అసలు వారి డిమాండ్లను పట్టించుకోవడం లేదు. తాము చేయాలనుకున్నదే చేస్తోంది.

# ఎన్నికల కోసం... పార్టీల వ్యూహాలు

నెల్లూరు, ఆగస్టు 26, ఆంధ్రప్రదేశ్  రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలవుతున్న వేళ ప్రధాన రాజకీయ పార్టీల వ్యూహాలు ఆసక్తిని పెంచుతున్నాయి. అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ  జనసేన భారతీయ జనతా పార్టీ  ఇప్పటికే ఎన్నికలపై దృష్టి పెట్టాయి. మూడు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని నడుపుతున్న నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లోనూ ఇదే సమన్వయాన్ని కొనసాగించాలని భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.సీట్ల పంపకమే ఇప్పుడు కూటమి లో ప్రధాన అంశంగా మారనుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ బలాన్ని చాటుకున్న జనసేన, బీజేపీలు స్థానిక ఎన్నికల్లో ఎక్కువ స్థానాలను ఆశించడం సహజమే. అయితే నియోజకవర్గాలు, స్థానిక పరిస్థితులు, పార్టీకి ఉన్న బలం, అభ్యర్థుల సామర్థ్యం వంటి అంశాలను పరిశీలించి టీడీపీతో కలిసి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. డిమాండ్లు ఎన్ని ఉన్నా చివరికి మూడు పార్టీలు ఒకే తాటిపైకి వచ్చి ఎన్నికలను ఎదుర్కొంటాయని కూటమి నేతలు భావిస్తున్నారు.2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయాన్ని దృష్టిలో పెట్టుకుంటే స్థానిక పోరు కూడా ప్రతిపక్షానికి పెద్ద సవాలుగా మారనుంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిసి సాధించిన విజయం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పునకు కారణమైంది. ఇప్పుడు అదే ఐక్యతను గ్రామ స్థాయి నుంచి నగర స్థాయి వరకు కొనసాగించడం కూటమికి ముఖ్యమైన అంశంగా మారింది.మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ  మాత్రం ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోందన్న ప్రచారం జరుగుతోంది. 2024 ఎన్నికల్లో కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన ఆ పార్టీకి స్థానిక ఎన్నికలు తమ బలాన్ని తిరిగి నిరూపించుకునే అవకాశం కావచ్చని నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కూటమిలో విభేదాలు వస్తాయని గతంలో చేసిన అంచనాలు ఫలించకపోవడంతో ఇప్పుడు కొత్త వ్యూహంతో ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి వైసీపీకి ఏర్పడింది.కొంతకాలం క్రితం వామపక్ష పార్టీలతో కలిసి పనిచేసే అవకాశాలపై చర్చ జరిగింది. ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటాలు నిర్వహించాలనే ఆలోచన కూడా తెరపైకి వచ్చింది. అయితే ఆ స్థాయిలో రాజకీయ అవగాహన ముందుకు సాగలేదు. వామపక్షాలు తమ కార్యక్రమాలతో కొనసాగుతుండగా, వైసీపీ కూడా తన రాజకీయ మార్గంలోనే పయనిస్తున్నట్లు కనిపిస్తోంది.స్థానిక ఎన్నికలను 2024 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చకూడదని వైసీపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల కాలంలో రాజకీయ పరిస్థితులు మారాయని, ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని ఆ పార్టీ అంచనా వేస్తోంది. తమకు గతంలో బలమైన పట్టు ఉన్న ప్రాంతాలను నిలబెట్టుకోవడంతో పాటు కూటమికి అనుకూలంగా వెళ్లిన కొన్ని స్థానాల్లో తిరిగి పుంజుకోవాలని వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.అయితే స్థానిక ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికల కంటే భిన్నంగా ఉంటాయి. అభ్యర్థి వ్యక్తిగత ప్రభావం, స్థానిక సమస్యలు, సామాజిక సమీకరణాలు, గ్రామ స్థాయి సంబంధాలు ఫలితాలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల ఈసారి ఎవరి అంచనాలు ఎంతవరకు నిజమవుతాయన్నది ఎన్నికల ఫలితాల తర్వాతే స్పష్టమవుతుంది.మొత్తానికి ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు కూటమి వర్సెస్ వైసీపీ మధ్య ప్రధాన పోరుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు, ఇతర రాజకీయ సంస్థలు పోటీ చేసినా ప్రధాన రాజకీయ

దృష్టి మాత్రం ఈ రెండు శిబిరాలపైనే ఉండనుంది. 2024లో కూటమికి వచ్చిన భారీ ఓటు మద్దతును అది ఎంతవరకు నిలబెట్టుకుంటుందో, వైసీపీ తన ఓటు శాతాన్ని ఎంతవరకు పెంచుకుంటుందో ఈ ఎన్నికలు తేల్చనున్నాయి.వైసీపీ నేతలు కుటుంబ వివాదాలకు, చేసిన నేరాలకు కులం రంగు పులుముకుంటున్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును, అతని కుమారుడిని ఈడీ అరెస్టు చేసింది. లిక్కర్ రవాణా టెండర్లలో వందల కోట్ల అక్రమాలు, దొంగ ఇన్‌వాయిస్‌లు, లగ్జరీ ఆస్తుల కొనుగోలుపై ఆధారాలతో దర్యాప్తు సంస్థ చర్యలు తీసుకుంటే? దానికి రాష్ట్ర ప్రభుత్వానికి గానీ, రాజకీయ కక్ష సాధింపులకు గానీ ముడిపెడుతూ బీసీ రంగు పులిమి బయటపడాలనుకుంటున్నారు.మరొకవైపు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి బైక్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన దానయ్య అనే నిరుపేద గొర్రెల కాపరి బీసీ కాదా? ఆ నిరుపేద కుటుంబానికి కనీస సానుభూతి తెలపకపోగా, నిందితుడిని రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు ఏ తరహా బీసీ ఉద్ధరణకు సంకేతం? బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాల్సింది పోయి, కేసును నీరుగార్చే ప్రయత్నం చేసిన నేతలకు బీసీల పట్ల నిజమైన ప్రేమ ఉందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నేరం చేసింది తమ వర్గం వారైతే ఒక న్యాయం, నిరుపేదలు బాధితులైతే మరో న్యాయమా అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.ఇక మరో నేత జోగి రమేష్ వ్యవహారంలోనూ ఇదే తీరు కనిపిస్తోంది. క్రిస్టియన్ మతాన్ని స్వీకరించిన వ్యక్తి సామాజిక మూలాలను పొలిటికల్ మైలేజ్ కోసం వాడుకుంటున్నారు. కుటుంబ వివాదంలో.. తమ కోడలికి అన్యాయం చేశారన్నది బహిరంగ నిజం. మరి ఆమె బీసీ బిడ్డ కాదా?. కుటుంబాన్ని సక్రమంగా ఉంచుకోలేక బీసీ అని కేకలేస్తే పనవుతుందా? .ఆర్థిక అక్రమాలు, తీవ్రమైననేరాలు , నిరుపేదల ప్రాణాలు తీసిన సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు విచారణ ఎదుర్కొనాల్సిందే. కేవలం వైఎస్సార్‌సీపీలో ఉంటేనే బీసీలు అవుతారా? ఇతర పార్టీల్లోని వారు, సాధారణ ప్రజలు బీసీలు కాదా? చేసిన తప్పుల తీవ్రతను కప్పిపుచ్చుకోవడానికి కులాన్ని, మతాన్ని కేడర్‌గా వాడుకోవాలనుకుంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. చట్టం తన పని తాను చేసుకుపోతున్నప్పుడు కులం వెనుక దాక్కోవాలనుకోవడం రాజకీయ చేతకానితనం అవుతుంది. కానీ వైసీపీ నేతలకు తెలిసిన విద్య అదే.

# టీడీపీ సోషల్ మీడియా టాస్క్

## టార్గెట్ జెన్ జీ, ఆల్ఫా

ఒంగోలు, ఆగస్టు 26,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ పాలనతో పాటు ప్రజలతో సమాచార సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా యువతను చేరుకోవడానికి సోషల్ మీడియాను సమర్థంగా ఉపయోగించుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యువతలో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి డిజిటల్ వేదికలకు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వారికి చేరువ చేయాలన్నది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది.ఇటీవలి కాలంలో రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా ఎంత కీలకంగా మారిందో పలు పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా యువతలో రాజకీయ చర్చలు ఎక్కువగా డిజిటల్ వేదికలపైనే జరుగుతున్నాయి. ఒక అంశంపై ప్రజాభిప్రాయాన్ని వేగంగా ప్రభావితం చేయడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను నేరుగా ప్రజలకు వివరించేందుకు కూడా సోషల్ మీడియా ఉపయోగపడుతోంది. ఈ మార్పును గుర్తించిన బీజేపీ  కూడా డిజిటల్ ప్రచారంపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది.ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోనూ కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా వ్యవస్థను మరింత చురుగ్గా మార్చాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో కొంతమంది మంత్రుల డిజిటల్ కార్యకలాపాలపై చంద్రబాబు వివరాలు తెలుసుకున్నట్లు తెలుస్తోంది. నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వంగలపూడి అనిత , ఫరూక్ , కొండపల్లి శ్రీనివాస్ (తదితరులు తమ కార్యక్రమాలు, ప్రజా సంబంధిత విషయాలను సోషల్ మీడియా ద్వారా పంచుకుంటున్నారని చర్చ జరిగింది.అయితే ఇంతటితో సరిపోదని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. ప్రతి మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ తమ నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలతో నిర్వహిస్తున్న సమావేశాలు, సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను డిజిటల్ మాధ్యమాల ద్వారా వివరించాలని సూచించినట్లు తెలుస్తోంది. ఒకే వేదికకు పరిమితం కాకుండా ప్రజలు ఎక్కువగా ఉపయోగించే అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన చెప్పినట్లు సమాచారం.ముఖ్యంగా వచ్చే రెండేళ్లలో యువ ఓటర్ల ప్రాధాన్యం మరింత పెరగనుందని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువతకు ప్రభుత్వం ఏం చేస్తోంది, ఉపాధి, విద్య, పరిశ్రమలు, సాంకేతిక రంగాల్లో ఎలాంటి అవకాశాలు కల్పిస్తోంది అనే విషయాలను వారికి సులభంగా అర్థమయ్యే విధంగా చెప్పాల్సిన అవసరం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి  ప్రారంభించిన 'జగన్ 2.0' యాప్ కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. డిజిటల్ వేదికల ద్వారా ప్రజలతో నిరంతర సంబంధం కొనసాగించే విషయంలో రాజకీయ నాయకులు మరింత ముందుండాలని చంద్రబాబు సూచించినట్లు తెలుస్తోంది. ప్రజలు ప్రశ్నిస్తే స్పందించడం, సమస్యలను గుర్తించి పరిష్కరించడం, చేసిన పనులను పారదర్శకంగా వివరించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది.అయితే సోషల్ మీడియాపైనే పూర్తిగా ఆధారపడకుండా ప్రధాన మీడియాకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు సూచించినట్లు సమాచారం. టెలివిజన్, పత్రికలు, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా.. అన్ని వేదికలను సమన్వయంతో ఉపయోగించినప్పుడే ప్రభుత్వ సందేశం విస్తృతంగా ప్రజల్లోకి వెళ్తుందని భావిస్తున్నారు. మొత్తంగా కూటమి ప్రభుత్వం డిజిటల్ కమ్యూనికేషన్‌ను మరింత బలోపేతం చేసి యువతతో ప్రత్యక్ష సంబంధం పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది

# కోదాడ రోడ్డు ప్రమాదంపై జిల్లా ఎస్పీదిగ్భ్రాంతి


ఏలూరు,సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట శివారులో జరిగిన  రోడ్డు ప్రమాద ఘటనపై ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు.  ??ప్రమాదానికి గురైన బస్సు హైదరాబాద్ నుంచి ఏలూరు వస్తున్న నేపథ్యంలో ఆయన వెంటనే సూర్యాపేట జిల్లా ఎస్పీ/పోలీస్ అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. ??బస్సులో ఉన్న ఏలూరు జిల్లాకు చెందిన ప్రయాణికులు, మృతులు లేదా క్షతగాత్రుల వివరాలను ఆరా తీస్తున్నారు. ఏలూరు జిల్లా వాసులు ఎవరైనా ఈ ప్రమాద బాధితుల జాబితాలో ఉన్నారా అనే కోణంలో అధికారిక వివరాలను సేకరిస్తున్నారు. బాధితుల కుటుంబాలకు సహాయం అందించేందుకు మరియు స్థానిక అధికారులతో సమన్వయం చేసుకునేందుకు ఏలూరు జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది అని జిల్లా ఎస్పీవెల్లడించారు.

# బెజవాడ బరిలో వారసులు

విజయవాడ, ఆగస్టు 26, ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి క్రమంగా పెరుగుతోంది. అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ, జనసేన , భారతీయ జనతా పార్టీ  తమ తమ వ్యూహాలతో ఎన్నికల సన్నాహకాల్లో నిమగ్నమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మండల పరిషత్, జిల్లా పరిషత్ పదవులతో పాటు పట్టణ ప్రాంతాల్లో మేయర్, చైర్‌పర్సన్ స్థానాలపై రాజకీయ పార్టీల దృష్టి ఎక్కువగా ఉంది. ముఖ్యంగా రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో మేయర్ పీఠాన్ని ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు.ఈ క్రమంలో విజయవాడ మేయర్ పదవికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. రాష్ట్ర రాజకీయాల్లో విజయవాడకు ఉన్న ప్రాముఖ్యత, అమరావతి కి సమీపంలో ఉండటం, నగరంలో ఉన్న రాజకీయ చైతన్యం కారణంగా ఇక్కడి మేయర్ స్థానం కోసం పోటీ తీవ్రంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ  విజయవాడ మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. అయితే ఈసారి పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుని నగర పాలనపై పట్టు సాధించాలని టీడీపీ భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.మేయర్ పదవి కోసం టీడీపీలో ఇప్పటికే పలువురు ఆశావహులు తమ ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో రాజకీయ కుటుంబాలకు చెందిన వారసుల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం  నుంచి వరుసగా విజయం సాధించిన ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు  కుటుంబం నుంచి కూడా ఒక పేరు చర్చకు వస్తోంది. తన కుమారుడిని రాజకీయాల్లోకి తీసుకురావడానికి మేయర్ పదవి మంచి వేదికగా ఉంటుందని బోండా ఉమా భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఇటీవల బోండా కుమారుడు రాజకీయ అంశాలపై స్పందిస్తూ మీడియా ముందుకు రావడం కూడా ఈ ఊహాగానాలకు బలం ఇచ్చింది. దీంతో ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది. ముఖ్యంగా విజయవాడ మేయర్ ఎన్నికల్లో కాపు సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించే అంశాన్ని టీడీపీ పరిశీలిస్తే, బోండా కుటుంబానికి అవకాశం దక్కవచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.మరోవైపు విజయవాడ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్న వంగవీటి కుటుంబం ఎ) పేరు కూడా తెరపైకి వస్తోంది. వంగవీటి రంగా కుమార్తె ఆశా కిరణ్ కొంతకాలంగా రాజకీయంగా చురుకుగా వ్యవహరిస్తున్నారు. గతంలో విశాఖపట్నంలో  నిర్వహించిన రంగానాడు కార్యక్రమం ద్వారా ఆమె రాజకీయంగా చర్చలోకి వచ్చారు. ఆమె జనసేన వైపు వెళ్తారనే ప్రచారం కూడా గతంలో జరిగింది.అయితే ఇప్పుడు ఆశా కిరణ్‌ను టీడీపీలోకి తీసుకువచ్చి విజయవాడ మేయర్ అభ్యర్థిగా నిలబెట్టే ఆలోచన ఉందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. వంగవీటి కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు కాపు సామాజిక వర్గాన్ని మరింత దగ్గర చేసుకునే వ్యూహంలో భాగంగా దీనిని చూడవచ్చని విశ్లేషణలు సాగుతున్నాయి. ఇప్పటికే వంగవీటి రాధాకృష్ణ  టీడీపీలో కొనసాగుతున్నారు.మేయర్ పీఠం కోసం పోటీ పడుతున్న పేర్లు, సామాజిక సమీకరణాలు, రాజకీయ వారసుల ప్రవేశం వంటి అంశాలు ఎన్నికల సమయానికి మరింత స్పష్టత పొందే అవకాశం ఉంది. చివరకు పార్టీ అధిష్ఠానం ఎవరిని ఎంపిక చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. విజయవాడ మేయర్ ఎన్నిక కేవలం ఒక నగర పాలక సంస్థ పోరుగా కాకుండా రాష్ట్ర రాజకీయాల్లో ప్రభావం చూపించే పోటీగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## నేడు ఉపరి తత్కాల పౌర్ణమి సందర్భంగా సామూహిక దత్త హోమము..



విభారే న్యూస్ ఆగస్టు 26 కర్నూలు జిల్లా ప్రతినిధి..జై గురుదత్త శ్రీ గురుదత్త శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో శ్రీ సూర్య నారాయణ స్వామి దేవస్థానంలో కొలువైఉన్న గురు దత్తాత్రేయ స్వామి వారికి శ్రావణమాసంలో శుక్లపక్ష చతుర్ధశి ఉపరి తత్కాల పౌర్ణమి నాడు అనగా నేడు ఉదయం 9.30 గంటలకు సామూహికంగా దత్తహోమమునిర్వహించబడును. దత్త హోమము చేసుకోవటము వలన సర్వ జాతక దోషములు, తొలగును. గురు బలము పెరిగి ఆరోగ్యము కలుగును. వివాహము, వ్యాపారము, ఉద్యోగము,సంతానము, సర్పదోషములు, పితృ సంబంధ దోషములు నివారణ అగును.కనుక భక్తులు ఈ అవకాశమును వినియోగించుకొని స్వామి వారి కృపతో సమస్యల నుండి విముక్తి పోందగలరు.దత్త హోమము ప్రధానముగా 2500/–హోమ సంకల్పం 116 /– వివరములకు సంప్రదించవలసిన నెం:–జి.ప్రద్యుమ్న కుమార్ శర్మ9440616198 ఫోన్ పే గూగుల్ పే నెంబరు..8896123777

## రేపు శ్రావణ పౌర్ణమి సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతం..

విభారే న్యూస్ ఆగస్టు 26 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురుదత్త శ్రీ గురుదత్త శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో శ్రీసూర్య నారాయణ స్వామి వారి దేవాలయంలో 28-08-2026, శుక్రవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీ రమా సహిత శ్రీ సత్య నారాయణ స్వామి వారి వ్రతములు అత్యంత వైభవోపేతంగా జరుగును .కలియుగం లో శ్రీ సత్య నారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించడం అత్యంత ఫలప్రదం.కావున భక్తులు ఈ సదావకాశాన్ని వినియోగించుకొని శ్రీ రమా సహిత శ్రీ సత్య నారాయణ స్వామి వారి కృపకు పాత్రులై తమ ఇష్ట కామ్యాలను పొందగలరు. గమనిక.ప్రధానంగా వ్రతం చేస్తున్న భక్తులు దయచేసి ఉదయం 8:30 గంటలకు



దేవాలయం లో సిద్ధం గా ఉండగలరు. భక్తులు సంప్రదాయ దుస్తులతో రావాలని మనవి.. వ్రతములో భక్తులు దయచేసి పూజారికి సహకరించగలరు.వ్రతం ప్రధానంగా – 1116/–వ్రత సంకల్పం – 116/–సంప్రదించండి :–శ్రీధర్ శర్మ –7995202082గూగుల్ పే ఫోన్ పే నెంబర్.8896123777ఆఫీసు ల్యాండ్ ఫోన్ నెంబర్..08518-234388

## పోలీస్ క్యాంటీన్ ప్రారంభం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 26: పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా నంద్యాల పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్ ప్రాంగణంలో సెంట్రల్ పోలీస్ క్యాంటీన్‌ను జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలోని అన్ని స్థాయిల సిబ్బంది ఈ క్యాంటీన్‌ను వినియోగించుకోవచ్చన్నారు. మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకే నాణ్యమైన నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు, వ్యక్తిగత వినియోగ వస్తువులు, ఎలక్ట్రానిక్ వస్తువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. స్టాక్‌లో లేని వస్తువులను ముందస్తు అభ్యర్థనపై తెప్పించే సౌకర్యం కూడా ఉంటుందన్నారు.పోలీసు సిబ్బంది బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, వారి నివాస ప్రాంతానికి సమీపంలోనే అవసరమైన వస్తువులు లభించేలా క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎస్. ఖాదర్ భాషా, చిన్నికృష్ణ, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, పోలీస్ వెల్ఫేర్ ఆర్ఐ విజయ నరసింహ, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి నాయక్, ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత--

### హియరింగ్స్‌ను వేగంగా పూర్తి చేయాలి--
### ఎన్నికల పరిశీలకురాలు ప్రశాంతి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 26: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం విధులను పకడ్బందీగా పూర్తి చేయాలని ఎన్నికల పరిశీలకురాలు ప్రశాంతి ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, ఎన్నికల



అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు, బూత్ స్థాయి అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.ఓటర్ల జాబితా సవరణ, నోటీసుల విచారణ, దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించిన ఆమె.. పెండింగ్‌లో ఉన్న విచారణలను, అభ్యంతరాలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపులో తగిన ఆధారాలను పరిశీలించి, రాజకీయ పార్టీలతో సమన్వయం పాటించాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందన్నారు. గణన పత్రాల పంపిణీ 100 శాతం పూర్తయిందని తెలిపారు. మ్యాపింగ్ కాని 6,066 మంది, తార్కిక లోపాలు ఉన్న 74,217 మంది కలిపి మొత్తం 80,283 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేశామన్నారు. ఇప్పటివరకు 36,382 విచారణలు నిర్వహించి ఆధారాలు సేకరించామని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, అనర్హులు మరియు నకిలీ నమోదులను నిబంధనల ప్రకారం గుర్తించి సరిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.అభ్యంతరాల స్వీకరణకు ఆగస్టు 30 చివరి తేదీ కాగా, పరిష్కారానికి సెప్టెంబర్ 28, తుది ఓటర్ల జాబితా ప్రచురణకు అక్టోబర్ 3 చివరి తేదీగా తెలిపారు.

# మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి--

### మదర్ తెరిసా విగ్రహానికి వినతిపత్రం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 26: నంద్యాల పట్టణంలో బుధవారం మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగులు తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మదర్ తెరిసా విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.కాంట్రాక్టు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఉద్యోగ భద్రత, వేతనాలు, ఇతర సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించకపోవడం వల్ల కాంట్రాక్టు ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు

# నేపాల్‌లో మెరుపు వరదలు.. బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌లో హై అలర్ట్..

నేపాల్‌లో మెరుపు వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వరదల కారణంగా ఇప్పటి వరకు 16 మంది ప్రాణాలు కోల్పోయారని, 400 మంది గల్లంతయ్యారని స్థానిక అధికారులు అంచనా వేస్తున్నారు. నేపాల్‌లో భారీ వరదల నేపథ్యంలో బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. వరద నీరు రెండు రాష్ట్రాలకు వ్యాపించే అవకాశం ఉన్నందున నేపాల్ సరిహద్దు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాయి. ఈ మేరకు బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి అధ్యక్షతన బుధవారం అత్యవసర సమావేశం జరిగింది.జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. డ్యామ్‌లు, కరకట్టలపై 24 గంటల నిఘా పెట్టాలని, రాత్రివేళల్లోనూ పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో లౌడ్‌స్పీకర్లతో హెచ్చరికలు జారీ చేయాలని, అత్యవసర పరిస్థితులకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి స్పష్టం చేశారు.నేపాల్ వరదల నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. . ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ముఖ్యమంత్రి యోగీ బుధవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. గండక్, నారాయణి నదులలో నీటి మట్టాలు పెరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ ప్రభావంతో మహారాజ్‌గంజ్, కుషీనగర్ జిల్లాలలో వరదలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. స్థానిక యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.



## ఓటర్ల జాబితాపై పార్టీలతో సమీక్ష--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 26: ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ఎన్నికల పరిశీలకురాలు శ్రీమతి పి. ప్రశాంతి, ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నోటీసుల విచారణ, అభ్యర్థనలు, అభ్యంతరాల స్వీకరణ, తుది ఓటర్ల జాబితా రూపకల్పనపై చర్చించారు. విచారణ సమయంలో అవసరమైన పత్రాలు, ఆధారాలను పరిశీలించాలని సూచించారు. అభ్యర్థనలు, అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉన్నందున అర్హులైన ఓటర్లు సకాలంలో దరఖాస్తులు సమర్పించేలా అవగాహన కల్పించాలని కోరారు.అన్ని దశల్లో ఎన్నికల యంత్రాంగానికి రాజకీయ పార్టీలు సహకరించి సమన్వయంతో పనిచేయాలని ప్రశాంతి సూచించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నంద్యాలలో మిలాదున్ నబీ ర్యాలీ--

### శాంతి, సామరస్యాలకు ప్రవక్త బోధనలు ఆదర్శం: ఎన్ఎండి ఫయాజ్--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 26: మిలాదున్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని నంద్యాలలో ముస్లిం సోదరులు, యువత ఆధ్వర్యంలో బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. చింతరుగు సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ చౌక్, శ్రీనివాస్ సెంటర్, సంజీవనగర్ గేట్ మీదుగా ప్రధాన రహదారుల గుండా సాగి తిరిగి చింతరుగు సెంటర్‌కు చేరుకుంది.ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, కరుణ, దయ, సోదరభావం మానవాళికి ఆదర్శమన్నారు. ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో, ప్రేమానురాగాలతో జీవించాలని ఆకాంక్షించారు. మిలాదున్ నబీ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్, మాబు జైలాన్, డీఎస్ మహబూబ్, జహీద్, జాఫర్, షేక్ మహమ్మద్ రఫీ (మున్నా), రసూల్, బషీర్ తదితరులు, ముస్లిం పెద్దలు, యువ నాయకులు, భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## 31వసారి రక్తదానం చేసిన నవీన్--

### అభినందనలు తెలిపిన ప్రముఖులు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 26: మిలాదున్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని గాంధీచౌక్ సమీపంలోని శ్రీ హజరత్ సయ్యద్ గులాబ్ షావలి అల్ రఫాయి అహ్మది దర్గా వద్ద గర్భిణీ మహిళల ప్రాణ రక్షణ కోసం ప్రత్యేక రక్తదాన శిబిరం నిర్వహించారు. దర్గా కమిటీ, విజయ బ్లడ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు.ఈ సందర్భంగా ముద్దం నాగ నవీన్ 31వసారి ఏ పాజిటివ్ రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఆయనను టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, పట్టణ ప్రముఖులు అభినందించారు. అనంతరం విజయ బ్లడ్ సెంటర్ ప్రతినిధులు, ఎస్పై సురేష్ ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు.కార్యక్రమంలో విజయ బ్లడ్ సెంటర్ నిర్వహణ కార్యదర్శి సద్దాం హుసేన్, దర్గా కమిటీ సభ్యులు, బ్లడ్ సెంటర్ సిబ్బంది, రక్తదాతలు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**